# సెంటిమెంట్‌తో కడుపులు నిండవు

- 7 సార్లు గెలిచిన ఈటల చేసిందేమీలేదు
- రూ. వెయ్యి కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తా
- 15 ఏండ్లుగా ప్రజల సేవలో ఉన్నా
- హుజూరాబాద్ గడ్డపై గులాబీ బొట్టు పెట్టాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- ఉప్పెనలా కదలిన ఊరూవాడ



వల్భాపూర్ ప్రచారంలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక/ జమ్మికుంట, నవంబర్2: 'సెంటిమెంట్ డైలాగులు కొట్టి ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు.. వాటితో పేదల కడుపులు నిండవు.. ఏడు సార్లు గెలిచిన ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదు.. బీసీ బంధును ఆపారు.. కాంగ్రెస్ నాయకులేమో దళితబంధు, రైతుబంధును ఆపించారు.. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి.. నేను మీ బిడ్డను.. ఒక్క అవకాశం ఇవ్వండి.. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తాను' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 15 ఏండ్లుగా ప్రజలకు సేవ చేస్తూ.. ఇండ్లు, వాకిలి, భార్యాపిల్లలను వదిలి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నానని, ఆశీర్వదిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గురువారం మండలంలో ప్రచార శంఖారావాన్ని పూరించారు. మొదట బేతిగల్‌లోని పెద్దమ్మతల్లి, రామాలయంలో సతీసమేతంగా పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. మండలంలోని బేతిగల్, కనపర్తి, నర్సింగాపూర్, వల్భాపూర్‌లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. బేతిగల్ నుంచి పోతిరెడ్డిపేటకు రోడ్డు, పోచమ్మతల్లి గుడి, భూలక్ష్మీ-మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠ చేపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, మాచనపల్లి, ఆబాది జమ్మికుంటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దని అన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు పల్లెల్లో రైతుల పరిస్థితి ఎలా ఉండేదో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. కరెంట్ ఎప్పుడూ వస్తదో, ఎప్పుడూ పోతదో తెలువక రాత్రిపూట కరెంట్ మోటర్ల కాడికి పోతే పాములు, తేళ్లు కుట్టి, కరెంట్ షాకులతో ఎంత మంది మృతిచెందారో, ఎన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయో, పంట పెట్టుబడి కోసం వడ్డీలకు తీసుకొచ్చి అప్పులు పాలైన రోజులను ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ రైతుల కష్టాలను అర్థం చేసుకొని 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గృహలక్ష్మీతో ₹3 లక్షలు, దివ్యాంగులకు ₹5 వేలు, ఆసరా పింఛన్లు ₹4 వేలు, రైతుబంధు ₹16 వేలు, ప్రతీ ఇంటికీ కేసీఆర్ బంధు, ₹400కే గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలను మ్యానిఫెస్టోలో ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి, హుజూరాబాద్ గడ్డకు గులాబీ బొట్టు పెట్టాలని పిలుపునిచ్చారు. కాగా గ్రామాల్లో కౌశిక్‌రెడ్డి ప్రచారానికి ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు. ప్రతీ గ్రామంలో మహిళలు, గ్రామస్తులు మంగళహారతులతో, డప్పుచప్పుళ్లతో, పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. పాడి కౌశిక్‌రెడ్డి-శాలినీరెడ్డి దంపతులు ప్రజల్లోకి వెళ్లి పేరుపేరున నమస్కరిస్తూ ఓటు అభ్యర్థించారు.

కొంగు చాపి అడుగుతున్న: పాడి శాలినీరెడ్డి

'మీ ఇంటి ఆడబిడ్డగా కొంగుచాపి అడుగుతున్న.. ఒక్క అవకాశం ఇవ్వండి. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి 15 ఏండ్లుగా కుటుంబాన్ని కూడా వదులుకొని ప్రజల మధ్య తిరుగుతున్న కౌశిక్‌రెడ్డిని ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాం' అని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీరెడ్డి ప్రజలను అభ్యర్థించారు. భర్త కౌశిక్‌రెడ్డితో కలిసి మండలంలో జరుగుతున్న ప్రచారంలో శాలినీరెడ్డి పాల్గొన్నారు. మహిళలను, పురుషులను కొంగు చాపి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎంపీపీ ముసిపట్ల రేణుకాతిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాలసాదవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలకిషన్‌రావు, సర్పంచ్‌లు రఘుపాల్‌రెడ్డి, సర్పంచులు మోరె సారయ్య, పర్లపెల్లి రమేశ్, సౌజన్య పాల్గొన్నారు.

# కేసీఆర్ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష



మాజీ ఎమ్మెల్యే దివంగత పొన్నమనేని నారాయణరావు మనుమడు శ్రీధర్‌రావుకు శాలువా కప్పి సత్కరిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు శ్రీనివాస్, రవీందర్‌రావు తదితరులు

- ప్రజా సంక్షేమానికి పాటుపడే బీఆర్ఎస్‌కు అన్ని వర్గాలు అండగా ఉండాలి
- 'దళిత బంధు'పై విమర్శలు సరికాదు
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థుల గెలుపునకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సిటీ సెంటర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఎక్కడలేని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిపోయిందన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని, కేసీఆర్ మూడో సారి సీఎం కావడం ఖాయమని ప్రజలందరిలో నమ్మకం పెరిగిందన్నారు. బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని మొదలుపెట్టిన ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూస్తే తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటగా పార్టీ గెలిచే సీటు ఇదే కానున్నదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు అన్నట్లుగా మూడు గంటల కరెంట్ కావాలా?, బీఆర్ఎస్ సర్కారుతో 3 పంటలు కావాలా? ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు పంటలకు సాగు, ప్రజలకు తాగునీరు, 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. కాంగ్రెస్, పాలనలో తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డారని, దానిని నేటికీ మర్చిపోలేరని, అందుకే అన్ని వర్గాలు బీఆర్ఎస్ వైపు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు దళితుల కోసం ఎలాంటి ప్రత్యేక స్కీమ్‌లు అమలు చేయకపోగా, దళిత బంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్‌ను కొందరు ప్రతిపక్ష దళిత నేతలు విమర్శించడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం కేసీఆర్ గతంలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని, కావాలని కొందరు బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసి విమర్శించడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ లాంటి సంక్షేమ పథకాలు అమలు చేసి అప్పుడు ఇక్కడి ప్రజలను ఓట్లు అడగాలని శ్రీనివాస్ ప్రతిపక్షాల నాయకులకు సూచించారు.

*మాజీ ఎమ్మెల్యే మనుమడికి సత్కారం..*

హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే దివంగత పొన్నమనేని నారాయణరావు మనుమడు పొన్నమనేని శ్రీధర్‌రావు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి మొదటిసారిగా రాగా, ఆయనకు గులాబీ కండువా, శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపునకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా శ్రీధర్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి తులసి లక్ష్మణమూర్తి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగురి ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎస్ ఇమ్రాన్, ఒంటెల రాజిరెడ్డి, బత్తుల సమ్మయ్య, గంట రమేశ్, కొలిపాక సమ్మయ్య, గంట కొమురయ్య, నిరంజన్ రెడ్డి, గంట శంకర్, పోచంపల్లి సదయ్య, ఇల్లందుల శ్రీనివాస్, వెంకటేశ్ గౌడ్, అన్నయ్య లింగం, వాసు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక



వల్భాపూర్‌లో ఎల్కదేవేందర్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నారని పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్భాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం అనంతరం గ్రామానికి చెందిన రెడ్డిసంఘం గ్రామాధ్యక్షుడు ఎలక్క దేవాల్‌రెడ్డి, మరో 50 మంది బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా, వారికి పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగమని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని, హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, బండారి వెంకటరాజం, పోరెడ్డి, తిరుపతిరెడ్డి, అందె కుమార్, జీడి తిరుపతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు అన్నారు. గురువారం పట్టణ శివారులోని కేసీ క్యాంపులో ఆయన మాట్లాడుతూ, ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల సౌకర్యం కోసం వివరాలు తెలుసుకోవడానికి ఆర్డీవో కార్యాలయంలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నామినేషన్ ఫారాలు తీసుకోవడం మొదలు, దాఖలు వరకు పాటించాల్సిన అన్ని అంశాలను వివరించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 2,44,514 ఓటర్లు (పురుషులు 1,19,676, మహిళలు 1, 24,833, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు) ఉన్నారని వెల్లడించారు. మొత్తం 305 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా, ఇందులో 82 గ్రామాలు అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. వీటిలో ఎన్నికలు జరిగే సమయంలో 153 వెబ్ కెమెరాలను అమర్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు మొత్తం 732 మందికి ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఓటరుగా నమోదై ఓటర్ కార్డు లేని వారికి ఓటర్ ఇన్ఫర్‌మేషన్ స్లిప్పులు అందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సహాయ ఎన్నికల అధికారులు కే విజయ్‌కుమార్, మాధవి పాల్గొన్నారు.



కమలాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్

## నెరవేరనున్న దశాబ్దాల కల

*రూ. 1.70 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం*

కమలాపూర్, నవంబర్ 2: మండలకేంద్రంలో నాలుగు లేన్ల రహదారి పక్కన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చివరిదశకు చేరుకోవడంతో మండల ప్రజల దశాబ్దాల కల త్వరలోనే నెరవేరనుంది. రెండేళ్ల క్రితం జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికలో ప్రచారానికి వచ్చిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు స్థానికులు ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆయన ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో కమలాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పట్టించుకోకున్నా ఉప ఎన్నికలో ఇచ్చిన హామీని తూ.చ. తప్పకుండా అమలు చేశారు. దీంతో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టి వేగంగా పూర్తి చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పర్యవేక్షిస్తూ ప్రత్యేక చొరవతో మూడు నెలల క్రితం కలెక్టర్‌ను పిలిపించి పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ పనులు త్వరితగతిన చేపట్టి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో బస్టాండ్ ఆవరణలో సీసీరోడ్డు పనులు పూర్తి చేశారు. హుజూరాబాద్-పరకాల నాలుగు లైన్ల రహదారి కావడంతో విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్ అందుబాటులోకి వస్తే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.